సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025

I



గోవిందా...కాపాడు..!
టీడీపీ వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి తీరుపై ఆ పార్టీ తమ్ముళ్లు విసిగిపోయారు. న్యాయం కోసం తిరుగుబావుటా ఎగురవేశారు. - IIలో



హామీ ఇచ్చారు...అమలు మరిచారు
కూటమి ప్రభుత్వంవిద్యార్థులను ముప్పతిప్పలు పెడుతోంది.ఫీజులు చెల్లించకుండా ఏడిపిస్తోంది. విద్యార్థులు ఫీజుల కోసం ఆందోళన బాటపడ్డారు. - IIలో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
32.0 /23.4
జిల్లాలో సోమవారం 23.4 – 32.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

మైలవరం కరకట్టకు మరమ్మతులు



మైలవరం కరకట్ట వద్ద పనులు చేస్తున్న లష్కర్లు

జమ్మలమడుగు : మైలవరం జలాశయం ఆనకట్టకు ఇరిగేషన్ అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. సోమవారం 'ప్రమాదంలో మైలవరం జలాశయం' అన్న శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం ఉదయం కరకట్ట వద్ద డీఈ మూర్తి ఆధ్వర్యంలో లష్కర్లు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ కరకట్ట వద్ద రాళ్లు కుంగిపోవడంతో ఆ ప్రాంతంలో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో ఏఈ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టుకు క్షమాపణ చెప్పిన పులివెందుల ఆర్డీఓ

కడప సెవెన్‌రోడ్స్ : సింహాద్రిపురం మండలం రావులకొలను గ్రామానికి చెందిన యు.హరిత చౌక దుకాణ డీలర్‌షిప్‌ను ఎలాంటి విచారణ లేకుండా ఏకపక్షంగా రద్దు చేసిన పులివెందుల ఆర్డీఓ పి.చిన్నయ్య రాష్ట్ర హైకోర్టుకు క్షమాపణలు చెప్పారు. సరైన కారణం చూపకుండా, చట్ట నిబంధనలు గాలికి వదిలి ఆమెపై చర్యలు తీసుకున్నారు. ఈ విషయంపై ఎఫ్‌పీ షాపు డీలర్ హరిత హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశారు. ఇందుకు సంబంధించిన రికార్డులన్నీ తీసుకుని తమ ఎదుట హాజరు కావాలని ఆర్డీఓను ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. హైకోర్టు సంధించిన ప్రశ్నలకు ఆర్డీఓ సరైన సమాధానం చెప్పలేక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దీంతో ఆయన కోర్టుకు క్షమాపణ చెప్పారు.

రిపబ్లిక్ డే ప్రి పరేడ్ శిబిరాల ఎంపికలు



పరేడ్‌కు హాజరైన ఎన్‌సీసీ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : వెస్ట్ జోన్ ప్రీ–రిపబ్లిక్ డే క్యాంపులో పాల్గొనేందుకు వైవీయూ–ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో వలంటీర్ల ఎంపిక నిర్వహించారు. ఈ జోన్ నుంచి విజయవంతమైన అభ్యర్థులు న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో ప్రాతినిధ్యం వహిస్తారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగిన ఎంపికలకు అన్నమయ్య, వైయస్సార్ కడప జిల్లా నుంచి వంద మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు హాజరయ్యారు. వారికి స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించారు. వీరిలో ముగ్గురిని ప్రీ రిపబ్లిక్ డే క్యాంపునకు ఎంపిక చేశారు. ఈ ఎంపికల ప్రక్రియలో ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయ యువజన అధికారి డాక్టర్ సయ్యద్, వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకట్రామ్ రెడ్డి, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ కే శ్రీనివాసరావు, డాక్టర్ కె. లలిత, డా. ఎస్పీ వెంకటరమణ మార్గదర్శకత్వం వహించారు.

జిల్లాకు చేరిన యూరియా

కడప అగ్రికల్చర్ : ఉమ్మడికడపజిల్లాకు 1335 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ తెలిపారు. ఇందులో 1011 మెట్రిక్ టన్నులు వైఎస్సార్‌జిల్లాకు కేటాయించగా ఇందులో 534 మెట్రిక్ టన్నులు మార్కెఫెడ్‌కు కేటాయించగా మరో 176 మెట్రిక్ టన్నులు మనగ్రోమోర్ సెంటర్లకు మిగిలిన 301 మెట్రిక్ టన్నులను ప్రైవేటు డీలర్లకు కేటాయించినట్లు తెలిపారు. అలాగే అన్నమయ్య జిల్లాకు 324 మెట్రిక్ టన్నులు కేటాయించామని వెల్లడించారు.

దసరా సంబరం.. ఆరంభం



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో రాజరాజేశ్వరి దేవీ అలంకారంలో అమ్మవారు...



నవగంగ తీర్థాలను తీసుకొస్తున్న ఆర్యవైశ్య మహిళలు





హర్యాణా భంభంభోలే కళాకారుల ప్రదర్శన

- వైభవంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన హర్యాణా అఘోరాల భంభంభోలే, భోపాల్ శివశక్తి డ్రమ్స్

ప్రొద్దుటూరు కల్చరల్ : పుత్తడిపురం ప్రొద్దుటూరులో దసరా ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. 102 మంది ఆర్యవైశ్య సుహాసినులు అగస్త్యేశ్వర స్వామి ఆలయం నుంచి కలశాలలో నింపిన నవగంగ తీర్థాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం నుంచి మంగళవాయిద్యాలతో, బాణసంచా పేలుళ్లతో ఊరేగింపుగా బయల్దేరి తెల్లాకుల శివయ్యగారి నగరేశ్వరస్వామి దేవస్థానం నుంచి శ్రీకన్యకాపరమేశ్వరిదేవి పురాణాన్ని తీసుకురావడంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలో హర్యాణా కళాకారుల అఘోరాల భంభంభోలే, భోపాల్ శివశక్తి డ్రమ్స్, శ్రీ కోదండరామ కోలాటబృందం వారి కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా బందోబస్తు నిర్వహించారు.

- శ్రీ మహాలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయ దసరా ఉత్సవ కమిటీ వారు ఊరేగింపుగా పాత బస్టాండ్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద పూజలు చేసి కలశాన్ని తీసుకెళ్లారు. కోలాట నృత్యం, బ్యాండుమేళం ఆకట్టుకుంది.
- స్థానిక శివాలయం రాజరాజేశ్వరి ఉత్సవ కమిటీ వారు దసరా ఉత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా కలశాలను ఊరేగిరపుగా తీసుకెళ్లి రాజీవ్ సర్కిల్‌లోని శివాలయంలో పూజలు చేశారు.
- రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి 250 మందిపైగా సుహాసినులు అగస్త్యేశ్వరాలయానికి చేరుకుని గంగాజలంతో నింపిన కలశాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు.
- శాస్త్రీనగర్‌లోని రాజరాజేశ్వరిదేవి ఆలయం, చౌడేశ్వరీదేవి, పెద్దమ్మతల్లి ఆలయం, ముక్తిరామలింగేశ్వరాలయం తదితర ఆలయాల నిర్వాహకులు కలశపూజను వైభవంగా నిర్వహించారు. కళాకారుల ప్రదర్శనలు, డప్పువాయిద్యాల ప్రదర్శనలు అలరించాయి.
- కడప అమ్మవారిశాలతో పాటు విజయదుర్గా ఆలయంలోనూ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



కడప అమ్మవారిశాలలో దీక్షాబంధన దేవీ అలంకారం



కడప విజయదుర్గాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ఆంజనేయస్వామి వేషధారణ

దసరాకు ప్రత్యేక బస్సులు



మాట్లాడుతున్న ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డి సర్కిల్ : దసరా పండుగను పురస్కరించుకుని వంద ప్రత్యేక బస్సులను నడపనున్నామని కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 30వ తేదీ, వచ్చేనెల 1వ తేదీన హైదరాబాద్ నుంచి 30బస్సులు, బెంగుళూరు నుంచి 30 బస్సులు, చెన్నై నగరం నుంచి 10 బస్సులు, 27, 28వ తేదీల్లో విజయవాడ నుంచి 30బస్సులను నడపనున్నామని తెలిపారు. అలాగే తిరుమల బ్రహ్మోత్సవాలకు కడప రీజియన్ నుంచి 40ప్రత్యేక బస్సులను నడపనున్నామని ఆర్ఎం తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ లావణ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

25న డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు

– డీఈఓ షేక్ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్ : డీఎస్సీ –2025కు ఎంపికైన వారికి ఈనెల 25వ తేదీ విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా నియామక పత్రాలు అందచేయనున్నట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఈ నెల 19వ తేదీన రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైఎస్సార్‌జిల్లాలో నియాయక పరీక్ష రాసిన అభ్యర్థులు తమకు అందజేసి ఐడెంటిటీ కార్డులతో ఈనెల 24వ తేదీ ఉదయం 6 గంటలకు కడప ఆర్ట్స్ కళాశాలలో మరోసారి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. మరిన్ని సూచనలు డీఎస్సీ అభ్యర్థుల వాట్సాప్ గ్రూపులో పంపిస్తామని డీఈఓ వివరించారు.

అర్జీగీ పెట్టినా.. ఫలితం సున్నా!

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలు బుట్టదాఖలవుతున్నాయి. వారాలు.. నెలలు కాదు.. సంవత్సరాల తరబడి తిరుగుతున్నా ఫిర్యాదులు పరిష్కారం కావడం లేదు.. అన్యాయం జరిగిందని అర్జీలు పెట్టినా అధికారుల మనస్సు కరగడం లేదు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ప్రజల ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని నలు చెరుగుల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలు ఆమె ఎదుట మొరపెట్టుకున్నారు. ఇప్పటికే పలుమార్లు వినతులు సమర్పించినా మండల స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు తమ ఆవేదన వ్యక్తం చేశారు. అందులో మచ్చుకు కొన్ని...

» శ్మశానాన్ని ఆక్రమించారు



మా గ్రామ పొలంలో సర్వే నెంబరు 178లో 1.83 ఎకరాల విస్తీర్ణంలో శ్మశాన స్థలం ఉంది. కొంతమంది శ్మశానికి వినియోగిస్తున్న స్థలంలో మామిడి చెట్లు నాటారు. ఈ విషయంపై మేము తహసీల్దార్, ఇతర అధికారులకు ఫిర్యాదు చేశాం. అధికారులు విచారణ చేసి అది శ్మశాన స్థలంగా తేల్చారు. అందులో బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పి ఇంతవరకు పట్టించుకోలేదు. శ్మశాన స్థలాన్ని సంరక్షించాలి. – జ్యోతి రామసుబ్బారెడ్డి, పాన్నోలు కొత్తపల్లె, సిద్దవటం మండలం

సర్వం కోల్పోయాం...ఆదుకోండి



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు తగలబడి సర్వం కోల్పోయాం. బేల్దారి పనికి వెళుతూ భార్యా పిల్లలను పోషించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నా. అసలే అరకొర ఆర్థిక పరిస్థితులతో అల్లాడుతున్న మాకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ మరింత అగాథంలోకి నెట్టింది. ఇంటి సామాగ్రితోపాటు సర్టిఫికెట్లు, రూ. 50 వేల నగదు కూడాఅగ్నికి ఆహుతయ్యాయి. రూ. 4 లక్షల మేర నష్టం వాటిల్లింది. రోడ్డున పడిన మా కుటుంబానికి పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నా.
– భార్గవరెడ్డి, సీకేదిన్నె మండలం

అన్యాయంగా తొలగించారు



మేము ప్రొద్దుటూరులో ఔట్‌సోర్సింగ్ కింద గృహ నిర్మాణ శాఖలో వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేసేవాళ్లం. అక్కడి ఏఈ బల్క్‌గా ఇసుకను కాంట్రాక్టర్‌కు ఇచ్చి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. ఇది కాంట్రాక్టర్, ఏఈకి మాత్రమే సంబంధించిన విషయం. ఇందులో మా ప్రమేయం ఏమీ ఉండదు. కానీ ఉన్నతాధికారులు ఏఈని రక్షించుకోవడం కోసం మమ్మల్ని అన్యాయంగా గత సెప్టెంబరు 29న తొలగించారు. ఎలాంటి విచారణ లేకుండా తొలగించడం అన్యాయమంటూ గ్రీవెన్స్‌సెల్‌లో పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. – దూదేకుల పెద్ద గుర్రప్ప, ఎస్.కుమారి, ప్రొద్దుటూరు

ఇల్లు మోసంతో రాయించుకున్నారు



నాకు ముగ్గురు ఆడపిల్లలు ఉండగా అందరికీ పెళ్లిళ్లు చేశాను. మూడు సెంట్ల స్థలంలో నాకున్న ఇంటిని మాయ మాటలు చెప్పి రాయించుకున్నారు. నేను వృద్ధుడిని. కాలు, చేయి సరిగా పనిచేయడం లేదు. కేవలం పింఛన్‌తో జీవిస్తున్నాను. అల్లుళ్లు ఎవరూ పట్టించుకోవడం లేదు. మోసంతో కాజేసిన ఇంటిని తిరిగి నాకు ఇప్పిస్తే ఈ మలి వయస్సులో ఎవరైనా యోగక్షేమాలు చూస్తారు.
– రామాంజనేయులు, బొజ్జావారిపల్లె, ప్రొద్దుటూరు

అక్రమ మైనింగ్ వాస్తవమే!

- శాసనమండలిలో అంగీకరించిన మంత్రి కొల్లు రవీంద్రా
- ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ప్రశ్నలకు జవాబిచ్చిన మంత్రి

సాక్షి ప్రతినిధి, కడప : వేముల, వేంపల్లె మండలాలల్లో అక్రమ మైనింగ్ వాస్తవమే.. 280 టన్నులు బరైటీస్ సీజ్ చేశారు. కూటమి సర్కార్‌లో ఇప్పటికీ రూ.31.54 లక్షలు జరిమానా విధించారు. ఎన్సీఎల్టీ ద్వారా కొనుగోలు చేసి నిల్వ ఉంచిన 2,626.76 మెట్రిక్ టన్నులు బెరైటీస్ ఖనిజం టిఫెన్ కంపెనీ ప్రాంగణంలో నిల్వలు లేవు. ఆ నిల్వలపై జిల్లా మైన్స్, జియాలజీ ఆఫీసు విచారణ కొనసాగుతోంది... ఇదీ శాసనమండలి వేదికగా గనులు, భూగర్భశాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెప్పిన మాటలు. అక్రమ మైనింగ్ వాస్తవమేనని మంత్రి మాటల్లో స్పష్టమైంది. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబు ఇచ్చారు.

మండల కేంద్రమైన వేములలో పలు అక్రమ గనుల్లో తీసిన బరైటీస్ ఖనిజాన్ని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ) నుంచి వేలంలో టిఫిన్ కంపెనీ కొనుగోలు చేసింది. ఆ కంపెనీ ప్రాంగణంలో నిల్వలు పెట్టారు. మరోవైపు స్వతహాగా మైనింగ్ చేసిన మరింత బరైటీస్ కలిపి దాదాపు 3,500 మెట్రిక్ టన్నులు నిల్వలు ఉన్నాయి. అందులో 2,626.76 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు ఎన్సీఎల్టీ సర్వేయర్లు నిర్ధారించారు. ఆ బెరైటీస్ నిల్వలపై తెలుగుతమ్ముళ్ల కన్ను పడింది. అక్రమ మైనింగ్ కంటే నిల్వలున్న బెరైటీస్ దోచుకునేందుకు సిద్ధమయ్యారు. సంక్రాంతి పండుగ సందర్భంగా రాత్రికి రాత్రే నిల్వలన్నీ తరలించుకపోయారు. బహిరంగ మార్కెట్‌లో రూ.10కోట్లు విలువైన బరైటీస్ ఖనిజాన్ని లూటీ చేశారు. తాజాగా శాసనమండలి వేదికగా ఎన్సీఎల్టీ ద్వారా వేలంలో కొనుగోలు చేసి నిల్వ ఉంచిన బరైటీస్ ఖనిజం రెవిన్యూ, మైనింగ్ అధికారులు బృందం సంయుక్త తనిఖీలల్లో అక్కడ బరైటీస్ నిల్వ లేదని నిర్ధారించారు. సదరు ఖనిజం అక్రమ రవాణాపై కడప జిల్లామైన్ అండ్ జియాలజీ ఆఫీసు పరిధిలో చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

280 మెట్రిక్ టన్నులు అక్రమ నిల్వలు...

వేముల, వేంపల్లె మండలాల్లో గనులు, భూగర్భశాఖ, రెవెన్యూశాఖల అధికారుల సంయుక్త తనిఖీ నివేదిక ఆధారంగా 280 మెట్రిక్ టన్నులు అక్రమ బెరైటీస్ ఖనిజం నిల్వలు గుర్తించినట్లు శాసనమండలికి నివేదించారు. వేంపల్లె, వేముల మండలాలల్లో 41 అక్రమ మైనింగ్ గుంతలు గుర్తించారు. జిల్లాలో బరైటీస్ ఖనిజం అక్రమంగా తరలిపోతున్నట్లు అధికారులు స్వయంగా నిర్ధారించారు. జిల్లా యంత్రాంగం డొల్లతనం శాసనమండలి వేదికగా బట్టబయలు కావడం గమనార్హం.

ఫిర్యాదు చేసినా చలనం లేదు..

తెలుగుదేశం పార్టీ నేతలు యంత్రాలతో లోడింగ్ చేస్తూ పెద్ద పెద్ద టిప్పర్లతో రాత్రికి రాత్రే బెరైటీస్ ఖనిజం తరలించుకుపోయారు. వేములతో పాటు కడప మిల్లుల్లో నిల్వలు ఉన్నాయి. టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి సహకారంతో టీడీపీ నేతలు పార్థసారధిరెడ్డి, మబ్బుచింతపల్లె శ్రీనాథ్‌రెడ్డి ప్రత్యక్ష ప్రమేయంతో తరలించకపోయినట్లు కేర్ టేకర్ రామలింగారెడ్డి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుకు జీపీఎస్ ద్వారా ఎక్కడెక్కడ నిల్వలున్నాయి. మిల్లులకు తరలించకపోయిన సామర్థ్యం వివరాలతో ఫిర్యాదు చేసినా అధికారుల్లో ఎలాంటి చలనం లేదు. కేవలం కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. 9నెలలుగా కేసులో ఎలాంటి పురోగతి లేదు. తాజాగా శాసనమండలి వేదికగా అక్రమ మైనింగ్, ఎన్సీఎల్టీ నిల్వలు దోపిడీ వ్యవహారం మరోమారు చర్చనీయాంశమైంది.

దాడి ఘటనలో 50 మందిపై కేసు

జమ్మలమడుగు రూరల్ : గండికోటలో జరుగుతున్న అభివృద్ధి పనులను గత కొన్ని రోజుల నుంచి రిత్విక్ కంపెనీ యజామాన్యం వారు సుమారు 60 వేల కోట్ల రూపాయలతో నిర్వహిస్తున్నారు. కాగా సోమవారం రిత్విక్ కంపెనీ నిర్వహిస్తున్న పనుల వద్దకు సుమారు 50 మంది వ్యక్తులు వెళ్లి కంటెయినర్‌లో ఉన్న ల్యాప్ ట్యాప్‌లు, జేసీబీకి నష్టం కలిగించినట్లు రిత్విక్ కంపెనీ మేనెజర్ కుమార్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు 50 మందిపై కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు.

రిత్విక్ కంపెనీ వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు..

రిత్విక్ కంపెనీ వారు పనులు నిర్వహిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సంఘటనలో గండికోట గ్రామానికి చెందిన గురుస్వామిని కులం పేరుతో రిత్విక్ కంపెనీ వారు దూషించినట్లు గురుస్వామి పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

పొలం యజమానిపై హత్యాయత్నం

మైదుకూరు : గొర్రెలు మేపుకునే విషయంలో తగాదా ఏర్పడి మండలంలోని శ్రీరామ్ నగర్ కు చెందిన ఆవుల గురవయ్య పై అదే గ్రామానికి చెందిన ఆదినారాయణ హత్యాయత్నం చేసినట్టు అర్బన్ సీఐ కె.రమణారెడ్డి తెలిపారు. జీవి సత్రంలోని శ్రీరామ్ నగర్ కు చెందిన ఆవుల గురవయ్యకు చెందిన బెండ తోటలో శనివారం ఆదినారాయణకు చెందిన గొర్రెలు మేస్తుండగా అడ్డుకోవడంతో వారి మధ్య గొడవ ఏర్పడినట్లు సిఐ పేర్కొన్నారు. ఆ మేరకు ఆదినారాయణ మచ్చు కత్తితో గురవయ్య పై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడినట్టు తెలిపారు. సంఘటనకు సంబంధించి ఆదినారాయణపై సోమవారం హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

వాహనదారులకు నాణ్యమైన సేవలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని వాహన యజమానులకు, డ్రైవింగ్ లైసెన్స్‌దారులకు నాణ్యమైన సేవలు అందిస్తామని జిల్లా ఇన్‌చార్జి ఉప రవాణా కమిషనర్ ఎం వీర్రాజు తెలిపారు. సోమవారం జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయానికి సంబంధించి వాహన్ పోర్టల్ లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి క్లియర్ చేస్తామన్నారు. ఈకెవైసీ కోసం చేసుకున్న దరఖాస్తులు 375 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. వాహన యాజమానులు తమ పనులకు సంబంధించి వాహన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పనులు పూర్తి కావట్లేదని భావించిన వారు బుధ, గురు వారాలలో ఉదయం 10 నుండి 1 గంట వరకు తనను నేరుగా కలవచ్చని తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలు


గాయపడిన నాగసుబ్బారెడ్డి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని మైదుకూరు రోడ్డులో గల మోర్ సూపర్ మార్కెట్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు సోమవారం మరమ్మత్తులు చేస్తూ ఓ లైన్ మెన్ తీవ్ర గాయాలపాలయ్యాడు. పట్టణంలోని మైదుకూరు రోడ్డులో నివసిస్తున్న కె.నాగసుబ్బారెడ్డి 17 ఏళ్లుగా విద్యుత్‌శాఖలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మోర్ సూపర్‌మార్కెట్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తులకు గురైందన్న ఫిర్యాదు అందుకున్న ఆయన పరిశీలించేందుకు వెళ్లాడు. ఎల్‌సీ తీసుకుని మరమ్మత్తులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే ఆయనతో పాటు ఉన్న జూనియర్ లైన్‌మెన్లు హుటాహుటిన ప్రైవేటు వాహనంలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి


నూర్పిడి యంత్రాలను ప్రారంభిస్తున్న ఏపీజీబీ అధికారులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రైతులకు వ్యవసాయ పనిముట్లకు రుణాలను ఇస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రాజంపేట రీజినల్ మేనేజర్ సుకాంత్ కుమార్ స్వరూప్, కడప ఆర్ఎం శ్రీనివాస ప్రసాద్, ఎల్‌డీఎం జనార్ధనం తెలిపారు. సోమవారం కడపలోని జాన్‌డీర్‌లో నర్సిరెడ్డి, శివకుమార్‌లకు నూర్పిడి యంత్రాలను అందజేశారు. డీఆర్డీఏ డీపీఎం రఘునాథరెడ్డి, బ్రాంచ్ మేనేజర్లు సురేష్‌కుమార్, ఎం.కళ్యాణి, రాజంపేట ప్రాంతీయ కార్యాలయ సీపీసీ మనోజ్‌కుమార్, వెంకటసాయి ఎంటర్‌ప్రైజస్ సంస్థ ఎండీ వెంకట్, జాన్‌డీర్ సేల్స్ మేనేజర్ దుర్గా మునికుమార్ పాల్గొన్నారు.

హామీ ఇచ్చారు.. అమలు మరిచారు

కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులను ముప్పుతిప్పలు పెడుతోంది. సకాలంలో ఫీజులు చెల్లించకుండా ఏడిపిస్తోంది. లోకేష్ యువగళం పాదయాత్రలో అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.అమలు మరిచారని డిగ్రీ చదివే విద్యార్థులు ఫీజుల కోసం రోడ్డెక్కి ఆందోళన బాటపట్టారు.

- ఫీజు రియింబర్స్‌మెంట్ కోసం రోడ్డెక్కిన విద్యార్థులు, కళాశాల యాజమాన్యం
- 16 నెలలుగా కరుణ చూపని కూటమి ప్రభుత్వం


ర్యాలీగా వస్తున్న ప్రైవేటు కళాశాలల కరస్పాండెంట్లు, విద్యార్థులు, విద్యార్థి సంఘ నాయకులు

కడప రూరల్/ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా 76 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. అందులో ద్వితీయ, తృతీయ సంవత్సరం చదివే విద్యార్థులు వేలాది మంది ఉన్నారు. ఇప్పటికే చివరి సంవత్సరం విద్యార్థులు వేలాది మంది టీసీలు తీసుకుని బయటికి వెళ్లారు. కాగా, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 16 నెలలు కావస్తున్నా వీరికి కేవలం ఒక టర్మ్‌మాత్రమే అంటే రూ. 5 వేల నుంచి రూ. 6 వేలకు మాత్రమే చెల్లించిన దాఖలాలు ఉన్నాయి. మిగతా సొమ్మును ఇంతవరకు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో విద్యార్థులపై ఫీజుల భారం పడుతోంది. ప్రధానంగా ఫైనల్ ఇయర్ విద్యార్థులు టీసీలు తీసుకునే సమయంలో ఫీజులు వసూలు చేశారు. ఈ నేపథ్యంలో పేద విద్యార్థులు ఫీజులు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకోలేక కష్టాలను ఎదుర్కొన్నారు.

ఫీజుల కోసం ఆందోళన

డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఫీజులు సకాలంలో చెల్లించాలని ఇదివరకే ప్రభుత్వానికి విన్నవించారు. ఈ సందర్భంగా పలువురు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు ఫీజులు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆ హామీ అమలు కాకపోవడంతో సోమవారం విద్యార్థి సంఘాలతో పాటు డిగ్రీ కళాశాలల యాజమాన్యం ర్యాలీలు, ఆందోళనకు దిగాయి.

జిల్లాలో డిగ్రీ విద్యార్థుల వివరాలు..	
కాలేజీలు	76
ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు	25000
టీసీలు తీసుకుని వెళ్లిన చివరి సంవత్సరం వారు	8000 మంది
ఒక విద్యార్థికి ఏడాదికి రావాల్సిన ఫీజు	రూ.15000 (కనీసం)
ఇప్పటివరకు ప్రభుత్వం చెల్లించినది	రూ. 5000
బకాయిలు మొత్తం	రూ.100 కోట్లకు పైగా

ఆమరణ దీక్ష చేపడతాం



లోకేష్ యువగళం పాదయాత్రలో అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని చెప్పిన హామీ నెరవేరలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16నెలలైనా ఏడు విడతలుగా రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ. 6400 కోట్లు విడుదల చేయలేదు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల ముగింపు లోపు విడుదల చేయకపోతే ఆమరణ దీక్ష చేపడతాం.- **ఓబులేసు యాదవ్, ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు**

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ అంశంపై అసెంబ్లీలో చర్చ జరిపి సత్వరమే విడుదల చేయాలి. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఉద్యమ బాట పడతారు.

- జయవర్ధన్, అఖిల బారత పార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి..



విద్యార్థులకు అందించాల్సిన ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి. కోర్సులు పూర్తి అయినా విద్యార్థులకు సర్టిఫికెట్ కావాలంటే ఫీజులు అందించాలి. ప్రభుత్వ సంపదను అమరావతికే కాదు ఫీజుల రూపంలో విద్యార్థులకు ఇవ్వాలి. లేక పోతే పోరుబాట తప్పదు.

- కె.సుబ్బరాయుడు, ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి

బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు

కమలాపురం : కమలాపురం రైల్వే గేటు సమీపంలోని మందిరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. రైల్వే గేటు తీయడంతో ఒక్క సారిగా బైక్‌లు క్రాస్‌రోడ్డు వైపునకు పరుగులు తీసాయి. ఈ నేపథ్యంలో ముందున్న బైక్‌ను వెనుక ఉన్న బైక్ వేగంగా ఢీ కొట్టడంతో ఇరువురు కింద పడ్డారు. ఈ ఘటనలో పెద్దపుత్తకు చెందిన సాయి అనే వ్యక్తికి తీవ్రంగా, జఫన్యాకు స్వల్ప గాయాలయ్యాయి. అలాగే క్రాస్ రోడ్డు సమీపంలో లారీ–కారు ఢీ కొంది. ఈ ఘటనలో ఎవరికి గాయాలు కాక పోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

చెట్లు నరికి అక్రమంగా తరలింపు

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ దద్దాలవారిపల్లె గ్రామానికి సమీపంలోని శ్రీ రెడ్డెమ్మకొండ పరిసరాల్లో ఉన్న కొండలు, గుట్టలతో పాటు పొలాల్లో పెద్ద ఎత్తున కలపచెట్లు ఉన్నాయి. వీటిపై అక్రమార్కుల కన్నుపడింది. కన్నుపడిందే తడవుగా చెట్లను అక్రమంగా నరికివేసి ట్రాక్టర్ల ద్వారా బయట మండలాలకు తరలించుకుపోతున్నారు. గత పదిహేను రోజులు ఈ తంతు సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొంత మంది బయట మండలాలకు చెందిన వ్యాపారులు ఇక్కడే మకాం వేసి ఇష్టానుసారం కలప చెట్లను నరికి అక్కడే కుప్పలుగా వేస్తున్నారు. కట్టెలు ఎక్కువగా సేకరించి ట్రాక్టర్ల ద్వారా బయట మండలాలకు తరలిస్తున్నారు. ఎంతో విలువైన వృక్షసంపదను నాశనం చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

ఆది వర్సెస్ సీఎం రమేష్


రిత్విక్ కంపెనీపై దాడి చేసి పగులగొట్టిన కార్యాలయం


కంప్యూటర్ కార్యాలయంలో ధ్వంసమైన కంప్యూటర్, ఫైళ్లు

- రిత్విక్ కంపెనీ మేనేజర్‌పై ఆదివర్గం దాడి
- కార్యాలయం ధ్వంసం
- ఆదిపత్యపోరుతో గండికోట అభివృద్ధికి ఆటంకం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఇది నా అడ్డా. ఇక్కడ నేను తప్ప ఎవరూ పనులు చేయకూడదు. కాదని చేస్తే దాడులు తప్పవనే సంకేతాలను ఆది వర్గం సీఎం రమేష్ నాయుడుకు పంపుతోంది. ఇప్పటికే టి.కోడూరు వద్ద అదాని గ్రూప్ కంపెనీకి చెందిన పవర్‌ప్లాంట్ పనులు సబ్ కాంట్రాక్టర్ కింద సీఎం రమేష్ నాయుడు కంపెనీ చేజిక్కించుకోగా ఎమ్మెల్యే ఆది వర్గం కంపెనీకి చెందిన ప్రతినిధులు, అధికారులపై దాడులు చేసి భయంభ్రాతులకు గురి చేశారు.

గండికోట టూరిజం అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పిలిచిన టెండర్లను రూ.78 కోట్లతో రిత్విక్ కంపెనీ చేజిక్కించుకుంది. దీంతో ఆదినారాయణరెడ్డి, ఆయన వర్గం వారు జీర్ణించుకోలేకపోతున్నారు. తాను శాసన సభ్యుడిగా ఉన్న నియోజకవర్గంలో మరొకరు వచ్చి కోట్లాది రూపాయలు పనులు చేయడం ఏమిటని మదన పడుతున్నారు. ఎలాగైనా రిత్విక్ కంపెనీ ప్రతినిధులను తమ అదుపులోకి తెచ్చుకునే విధంగా గత కొంత కాలంగా గండికోటలో జరుగుతున్న పనులకు స్థానిక నాయకులు అడ్డు తగులుతూ వచ్చారు. దీంతో గండికోట గ్రామంలో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది.

ఆరు వాహనాల్లో వచ్చారు.. దాడి చేశారు

ఆది వర్గానికి చెందిన వారు ఆరు వాహనాల్లో గండికోటకు వెళ్లి రిత్విక్ కంపెనీపై దాడులు చేశారు. సోమవారం మధ్యాహ్నం ఆదినారాయణరెడ్డి వర్గీయులు పోలీసుల సమక్షంలోనే దాడులు చేసినట్లు సమాచారం .పోలీసులు ముందుకు రాకండి, ఫొటోలు, వీడియోలు కూడా తీయవద్దు. అంటూ రిత్విక్ కంపెనీపై రాళ్లదాడి చేసి మేనేజర్‌ను సైతం కొట్టారు. మరో ప్రాంతంలో ఉన్న జేసీబీని పగుల గొట్టారు. స్థానికంగా ఉన్న పోలీసులు మేము ఏమి చేయగలం, తమ ప్రాణాలు చిన్నవి అంటూ సెలవిస్తున్నారు. దాడి అనంతరం అర్బన్ సీఐ నరేష్‌బాబు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

గోవిందా.. కాపాడు..!

- పార్టీ కోసం కష్టపడిన వారిని బయటపడేశారు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు వాసు, ఎమ్మెల్యే మాధవీ రాజ్యాంగం నడుస్తోంది
- వారి ఆగడాల నుంచి తట్టుకోలేక పోతున్నాం
- కార్యకర్తలకు న్యాయం చేయండి
- శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి పాదాల వద్ద వినతిపత్రం సమర్పించిన తెలుగు తమ్ముళ్లు


మాట్లాడుతున్న పాత కడప కృష్ణారెడ్డి

కడప రూరల్ : తెలుగుదేశం పార్టీ వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి తీరుపై ఆ పార్టీ తమ్ముళ్లు విసిగిపోయారు. న్యాయం కోసం తిరుగుబావుటా ఎగురవేశారు. పాతకడప కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీకి చెందిన కార్యకర్తలు బహిరంగంగా రోడ్డుపైకి వచ్చి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఆ మేరకు సోమవారం స్థానిక దేవునికడపలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆయన పాదాల చెంత తమను కాపాడాలంటూ వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే మాధవీరెడ్డి ఆగడాలను భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కడపలో అంబేడ్కర్ రాజ్యాంగానికి బదులుగా శ్రీనివాసులురెడ్డి, మాధవీరెడ్డిల రాజ్యాంగం నడుస్తోందన్నారు. నాడు ఎమ్మెల్యేగా మాధవీరెడ్డికి టిక్కెట్ ఇచ్చినపుడు దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి వద్దనుంచే ప్రచారం చేశామని, ఆమె గెలుపుకోసం కృషి చేశామన్నారు. నేడు ఈ పుణ్య స్థలం నుంచే ఆమె ఆగడాలు భరించలేక తిరుగుబాటు చేస్తున్నామని తెలిపారు. గెలుపుకోసం పనిచేసిన పార్టీ కార్యకర్తలను బయటపడేశారని అన్నారు. పార్టీలో పనిచేస్తున్న నిజమైన కార్యకర్తలకు న్యాయం జరగాలన్నారు. చెన్నంశెట్టి మురళీకృష్ణ మాట్లాడుతూ శ్రీనివాసులురెడ్డి, మాధవీరెడ్డి ఎన్నికలకు ముందు ఒకలా, గెలిచిన తర్వాత తమ స్వరూపాన్ని బయటపెట్టారన్నారు. వారి దౌర్జన్యాల నుంచి పార్టీ కార్యకర్తలను కాపాడాలన్నారు. ఆ పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు సుబ్బలక్షుమ్మ, చిప్పగిరి మీనాక్షి మాట్లాడుతూ పార్టీలో తమకు ఏనాడూ న్యాయం జరగలేదని వాపోయారు. అనంతరం వారు మాకు పెద్ద దిక్కుగా పుత్తా నరసింహారెడ్డి వ్యవహరించాలని కోరుతూ 20కి పైగా వాహనాల్లో కమలాపురం వెళ్లారు.

సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకు వెళతా – పుత్తా నరసింహారెడ్డి

తమను కలవడానికి వచ్చిన కడప నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలతో ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయనను కలిసిన కార్యకర్తలు కడప నియోజకవర్గంలో జరుగుతున్న అన్యాయాలపై ఏకరువు పెట్టారు. తమకు పెద్ద దిక్కుగా ఉండి ముందుకు నడిపించాలని అభ్యర్థించారు. మాకు మీ వల్ల తప్పితే మరెవరి వల్ల న్యాయం జరగదని కోరారు. ఈ సందర్భంగా పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ వేరొకరి నియోజకవర్గంలో జోక్యం చేసుకోలేనని, అయితే పార్టీ కార్యకర్తగా కార్యకర్తల మనోభావాలను అధిష్టానం దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు. జరుగుతున్న పరిణామాలు ఆ పార్టీలో కలకలం రేపుతున్నాయి. ఈ కార్యక్రమంలో వీరయ్య, శివరాం, కొండా సుబ్బయ్య, స్వర్ణమ్మ, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.


వినతిపత్రం సమర్పిస్తున్న పాతకడప టీడీపీ నాయకుడు కృష్ణారెడ్డి తదితరులు


టీడీపీ నేత పుత్తా నరసింహారెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న కడప నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు

బాధితులకు న్యాయం చేయాలి

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్


దివ్యాంగుల వద్దకు వెళ్లి ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప కోటిరెడ్డి సర్కిల్ : ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని, బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీగా షెల్కే నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలపై అర్జీలను స్వీకరించారు. 119 ఫిర్యాదులు వచ్చాయి.వీటిని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలంటూ పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన వృద్ధులు, దివ్యాంగుల వద్దకు ఎస్పీ వెళ్లి ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్, డీసీజీ డీఎస్పీ అబ్దుల్ కరీం, తదితరులు పాల్గొన్నారు.

కాశినాయనవాసికి అరుదైన గుర్తింపు


కడియాల చంద్రబాబు నాయుడు

కాశినాయన : అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రకటించిన ప్రతిభావంతులైన టాప్ 2025 శాస్త్రవేత్తల జాబితాలో వైఎస్సార్ జిల్లా కాశినాయన మండలం ఇటుకలపాడు గ్రామానికి చెందిన కడియాల చంద్రబాబునాయుడు వరుసగా 6 సారి చోటు దక్కించుకున్నారు. వ్యవసాయకుటుంబంలో పుట్టిన ఈయన బెంగళూరు గీతండీమ్డ్ విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్ర అసోసియేటెడ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. పలు పరిశోధన రంగాల్లో వివిధ శాస్త్రవేత్తలు ప్రచురించిన పరిశోధనా పత్రాలను ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరిగి వారి పరిశోధన పత్రాలను అనుసరిస్తూ సూచికలు వాడటం వల్ల ఈ గుర్తింపును పొందారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ


రాయచోటిలో కోర్టు విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

రాయచోటి జగదాంబసెంటర్ : వివిధ కారణాలతో చనిపోతున్న న్యాయవాదులకు సంవత్సరంలో ఏదో ఒక రోజు ఉదయం కోర్టు పనిగంటల్లో సంతాపాన్ని తెలిపే సంస్కృతిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రద్దు చేయడాన్ని న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. సోమవారం రాయచోటి బార్ అసోసియేషన్ న్యాయవాదులుఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి, సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుయోధనతో కలిసి విధులు బహిష్కరించడానికి గల కారణాలను తెలియజేసిన అనంతరం కోర్టు మెయిన్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.రెడ్డిబాషా మాట్లాడుతూ ఇప్పటి వరకు వివిధ కారణాలతో చనిపోయిన న్యాయవాదులకు సంవత్సరంలో ఏదో ఒక రోజున ఉదయం. 10.30 గంటలకు సంతాపాన్ని తెలియజేసే సంస్కృతి ఎప్పటి నుంచో ఉందని తెలిపారు. రాష్ట్ర హైకోర్టు ఈ కార్యక్రమాన్ని రద్దు చేసిందని అన్నారు. దీనిని తక్షణం వెనక్కి తీసుకోవాలని భారత న్యాయవాదుల సంఘం అన్నమయ్య, కడప జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్, సహాయ కార్యదర్శి ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. రాయచోటి బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో ఉద్రిక్తత


ఆర్టీపీపీ జేఏసీ, టీఎన్‌వీకేఎస్, బీఎంఎస్‌ల మధ్య తోపులాట దృశ్యం

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎం వీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో సోమవారం ఏపీ ఎస్పీ జేఏసీ, టీఎన్‌వీకేఎస్, బీఎంఎస్ యూనియన్ల మధ్య తోపులాట జరిగింది. కొంచెం సేపు ఉద్రిక్త చోటు చేసుకుంది. పోలీస్, విజిలెన్స్, ఎస్‌పీఎఫ్ సిబ్బంది అక్కడికి చేరుకుని ఇరువురు వర్గాల వారితో మాట్లాడి సర్దిచెప్పారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఏపీ జేఏసీ నిరసనలు, రిలే దీక్షలు చేసి సోమవారం ఫౌంటెయిన్ వద్ద నుంచి ర్యాలీ చేపట్టింది. అదే సమయంలో ప్రభుత్వంలో భాగమైన టీఎన్‌వీకేఎస్, బీఎంఎస్ యూనియన్లు కలసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంట్రాక్ట్ కార్మికుల కోసం నిరసనలు చేపట్టి సోమవారం రిలే దీక్షలు ప్రారంభించి గేటు బయట ఆందోళన చేసింది. జేఏసీ ర్యాలీ అనంతరం ఉద్యోగ, కార్మికులు విధులకు వెళ్తుండగా, గేటు బయట టీఎన్‌వీకేఎస్, బీఎంఎస్ యూనియన్లు విధులకు పోకుండా అడ్డుకుంది. దీంతో ఒక్కసారిగా జేఏసీ, ఆ రెండు యూనియన్ల మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో జేఏసీకి చెందిన ఓ ఉద్యోగి చొక్కా చినిగింది. అక్కడే ఉన్న పోలీసులు సర్దిచెప్పారు. అయినా జేఏసీ నేతలందరూ సంయమనం పాటించి ఎవరు చేసినా ఉద్యోగ కార్మిక సమక్షం కోసమే..ఎవరూ వ్యక్తిగత వాదనలకు పోకూడదని మైకులో చెప్పారు. అనంతరం జేఏసీ నాయకులు ఆర్టీపీపీ సీఈ ని కలిసి వినతి పత్రం అందించారు.

గ్యాస్ బిల్లుల స్కాంపై విచారణ జరిపించాలి

రాయచోటి జగదాంబసెంటర్ : జిల్లా వ్యాప్తంగా కేజీబీవీలలో జరిగే గ్యాస్ బిల్లుల స్కాంపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్‌ఏ అధ్యక్షుడు కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటిలోని కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్‌కు ఏఐఎస్‌ఏ నాయకులు వినతిపత్రం సమర్పించారు.

రెండు నిమిషాల్లోనే చంపేశారు

- హైదరాబాద్‌కు చెందిన కిరాయి హంతకుల చేతిలో హతమైన ఫైనాన్షియర్
- బాకీ దారుల ఆస్తుల అటాచ్ కోసం కోర్టులో కేసు వేసిన వేణుగోపాల్‌రెడ్డి
- ఆ కోపంతోనే హత్య చేయించిన బాకీ దారులు


వేణుగోపాల్‌రెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : వడ్డీ వ్యాపారి వేణుగోపాల్‌రెడ్డి కిరాయి హంతకుల చేతిలో హతమయ్యాడు. వేణుగోపాల్‌రెడ్డి వద్ద బాకీ తీసుకున్న ఇరువురు వ్యక్తులు హైదరాబాద్‌కు చెందిన కిరాయి హంతకుల ద్వారా అతన్ని చంపించినట్లు తెలుస్తోంది. ప్రొద్దుటూరులోని బొల్లవరం ప్లాట్‌లలో నివాసం ఉంటున్న వడ్డీ వ్యాపారి కొండా వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం రాత్రి హత్యకు గురైన విషయం తెలిసిందే. రెండు రోజుల గాలింపు చర్యల అనంతరం రూరల్ పోలీసులు ఆదివారం సాయంత్రం అతని మృతదేహాన్ని చాపాడు వద్దనున్న కుందు వంతెన వద్ద గుర్తించారు. అగ్నిమాపక శాఖ రెస్క్యూ టీంతో కలిసి రూరల్ పోలీసులు అతికష్టం మీద వేణుగోపాల్‌రెడ్డి మృతదేహాన్ని నదిలో నుంచి వెలికి తీశారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం పోలీసులు అతని మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ప్రొద్దుటూరుకు చెందిన వేణుగోపాల్‌రెడ్డి బంధువు, మరో వ్యక్తి కలసి వేణుగోపాల్‌రెడ్డిని హతమార్చేందుకు కొన్ని రోజుల ముందే వ్యూహ రచన చేశారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌కు చెందిన నలుగురు కిరాయి హంతకులను శుక్రవారం ప్రొద్దుటూరుకు పిలిపించారు. వారు తమ కారును వేణుగోపాల్‌రెడ్డి ఇంటి సమీపంలో ఉన్న ఆర్చి వద్ద ఆపుకున్నారు. అక్కడ వారు ఉన్న సమయంలోనే సాయంత్రం వేణుగోపాల్‌రెడ్డి ఇంటి నుంచి స్కూటీలో పట్టణంలోకి వెళ్లాడు. అదే రోజు రాత్రి సుమారు 8.30 గంటల తర్వాత ఇంటికి బయలుదేరాడు. ఇంటి సమీపంలో ఉన్న ఆర్చీ దాటగానే కారులో ఉన్న కిరాయి హంతకులు అతన్ని ఆపినట్లు తెలిసింది. ఎవరు మీరు అని అడిగే లోపే వారు వేణుగోపాల్‌రెడ్డిని కొట్టడంతో కింద పడిపోయాడని, ఈ క్రమంలోనే దుండగులు కాళ్లతో గొంతు నులిమి చంపేసినట్లు విశ్వసనీయ సమాచారం. 'నన్ను చంపొద్దు.. మీకు ఏం కావాలో చెప్పండి ఇస్తాను' అని బతిమాలుకున్నా దుండగులు కనికరించలేదని తెలిసింది. వేణుగోపాల్‌రెడ్డి స్కూటీలో అక్కడికి రావడం, వారు హత్య చేయడం ఇదంతా రెండు, మూడు నిమిషాల్లోనే జరిగినట్లు తెలుస్తోంది. కాగా ఫైనాన్స్ వ్యాపారి చనిపోయాడని నిర్ధారణ చేసుకున్న దుండగులు మృతదేహాన్ని అదే కారులో వేసుకొని దువ్వూరు దారిలోని కామనూరు బ్రిడ్జి వద్ద కుందు నదిలో పడేసి అదే రాత్రికి హైదరాబాద్‌కు వెళ్లిపోయినట్లు పోలీసు వర్గాల సమాచారం. తర్వాత నిందితులు హైదరాబాద్‌లో ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారిచ్చిన సమాచారంతోనే కుందు నదిలో ఉన్న వేణుగోపాల్‌రెడ్డి మృతదేహాన్ని పోలీసులు గుర్తించి వెలికి తీశారు.

నిందితుల్లో వేణుగోపాల్‌రెడ్డి భార్య తరపు బంధువు కూడా..

వేణుగోపాల్‌రెడ్డిని హతమార్చిన వారిలో అతని భార్య సమీప బంధువు ఒకరు ఉన్నట్లు తెలిసింది. కాగా 2016లో నిందితుల్లోని ఒక వ్యక్తితో గొడవ జరిగింది. వేణుగోపాల్‌రెడ్డి డబ్బు అడగటానికి వెళ్లగా అతను దాడి చేశాడు. దీంతో వేణుగోపాల్‌రెడ్డికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో రెండేళ్ల క్రితం వీరి మధ్య రాజీ కుదిరింది. కాగా నిందితుల్లోని ఇద్దరు వ్యక్తులకు వేణుగోపాల్‌రెడ్డి రూ. లక్షల్లో బాకీ ఇచ్చాడు. ఈ డబ్బు గడువు ముగిసినా వారు ఇవ్వకపోవడంతో ఫైనాన్షియర్ కోర్టులో కేసు వేశాడు. అంతేగాక కొంత కాలం తర్వాత వారి ఆస్తులు అటాచ్ కోరుతూ ఫైనాన్షియర్ మరో మారు కోర్టును ఆశ్రయించాడు. ఇది ఇరువురు బాకీ దారులకు ఆగ్రహాన్ని కలిగించింది. ఈ విషయమై పలువురు వేణుగోపాల్‌రెడ్డికి నచ్చచెప్పినట్లు తెలిసింది. అయినా కూడా అతను ఆస్తుల అటాచ్ విషయంలో వెనక్కి తగ్గలేదు. ఈ కారణంతోనే ఇద్దరు కలిసి హైదరాబాద్‌కు చెందిన నలుగురు కిరాయి హంతకులతో వేణుగోపాల్‌రెడ్డిని హతమార్చినట్లు సమాచారం. కాగా కేసులోని ప్రధాన నిందితులు, కిరాయి హంతకులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది. వారిని పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. ఈ కేసులో ఇంకెవరికైనా ప్రమేయం ఉందా అనే కోణంలో ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు.